సాక్షి
నిర్మల్
బుధవారం । 17 । జనవరి । 2024



'పది'లో ఏడు పేపర్లు 8లో▸

పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వం ఈసారి స్వల్ప మార్పులు చేసింది. గతేడాది సబ్జెక్టుకు ఒక పేపర్ పరీక్ష నిర్వహించగా, ఈసారి ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పరీక్షలు నిర్వహించనుంది.



పండగ పూట విషాదం.. 8లో▸

జిల్లాలో పండగ పూట విషాదం నెలకొంది. తానూర్, నిర్మల్ మండలాల్లో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.1/18.5

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. చలి ప్రభావం చాలావరకు తగ్గుతుంది. వేకువ జామున పొగమంచు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఘనంగా జ్యోతి దర్శనం



అభిషేకంలో ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసా:పట్టణంలోని అన్నపూర్ణ క్షేత్రం ఆవరణలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో జ్యోతి దర్శన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ గురుస్వామి మంత్రి సాయినాథ్ ఆధ్వర్యంలో సోమవారం పూజలు నిర్వహించారు. ఆలయంలో మండల పూజ ఏర్పాటు చేశారు. అనంతరం మెట్ల పూజ జరిగింది. కన్నెముల గణపతి, సుబ్రహ్మణ్యస్వాములకు పూజలు చేశారు. అయ్యప్పస్వామి అభిషేకంలో ఎమ్మెల్యే రామారావుపటేల్ పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు అయ్యప్పస్వామి భజనలుచేశారు. జ్యోతి దర్శనం ముగిశాక అగ్నిగుండ ప్రవేశం చేశారు.

సమష్టిగా రైల్వేలైన్ సాధిద్దాం

- సాధన కమిటీ అధ్యక్షుడు ఎంసీ.లింగన్న
- ఆదిలాబాద్–నిర్మల్–ఆర్మూర్ రైల్వేలైన్ కమిటీ ఏర్పాటు



మాట్లాడుతున్న కమిటీ కన్వీనర్ మనోజ్‌యాదవ్

నిర్మల్:నిర్మల్ జిల్లా మీదుగా రైల్వేలైన్ నిర్మాణం చేపట్టే వరకు అన్నివర్గాలు, సంఘాలు, పార్టీలు కలిసి సమష్టిగా పనిచేద్దామని ఆదిలాబాద్–నిర్మల్–ఆర్మూర్ రైల్వేలైన్ సాధన కమిటీ అధ్యక్షుడు ఎంసీ.లింగన్న అన్నారు. జిల్లాకేంద్రంలోని పెన్షనర్ల సంఘ భవనంలో పార్టీలు, సంఘాలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సాధన కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఎంసీ.లింగన్న, కన్వీనర్‌గా ఈసవేణి మనోజ్‌యాదవ్ ఎన్నికయ్యారు. అనంతరం లింగన్న మాట్లాడుతూ రైల్వేలైన్ సాధించే వరకు వివిధ స్థాయిలలో అందరినీ కలుపుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిసి వచ్చేలా కార్యక్రమాలు చేపడతామన్నారు. జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు రావుల రాంనాథ్, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, శేఖర్, ఎస్ఎన్.రెడ్డి, మల్లారెడ్డి, వెల్మల ప్రభాకర్, సాయన్న, రాములు, వెంకట్‌స్వామి, రంజిత్, ముత్యంయాదవ్, గణేశ్, లక్ష్మణ్, మురళీమనోహర్‌రెడ్డి, పద్మనాభంగౌడ్, విలాస్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టపల్లిలో అడిషనల్ కలెక్టర్ పర్యటన



గ్రామంలో పర్యటిస్తున్న ఫైజాన్ అహ్మద్

లక్ష్మణచాంద:మండలంలోని పొట్టపల్లి(కె) గ్రామంలో అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మంగళవారం పర్యటించారు. పాదయాత్రగా వీధులను పరిశీలించారు. గ్రామానికి చెందిన యువకులు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ప్రవర్తన సరిగా లేదని, గ్రామస్తులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని మురికి కాలువను శుభ్రం చేయడం లేదని తెలిపారు. అనంతరం నర్సరీని, సెగ్రిగేషన్ షెడ్డు, పల్లె ప్రకృతివనం, దోభీగాట్‌ను పరిశీలించారు. గ్రామ పంచాయతీలో రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడంతో కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రవర్తన మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధి హామీ పథకం రికార్డులు అప్‌డేట్ చేయకపోవడంతో మందలించారు. వారం రోజుల్లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీపీవో శ్రీలత, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీవో నసీరుద్దీన్, ఎస్సై శ్రీకాంత్, సర్పంచ్ హైమావతి తదితరులు ఉన్నారు.





ఖానాపూర్ : దుబాయ్‌లో ముగ్గులు వేస్తున్న యువతులు, మహిళలు, హరిదాసు, సోదమ్మ వేషధారణలో..



అట్లాంటాలో సంక్రాంతి వేడుకల్లో పాటలు పాడుతున్న పన్నెల జనార్దన్



నిర్మల్ రూరల్: ముగ్గులు వేస్తున్న చిన్నారులు

సంబురంగా సంక్రాంతి

నిర్మల్ రూరల్ : సంక్రాంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే మహిళలు ఇళ్ల ముగిళ్లలో రంగు రంగుల ముగ్గులు వేశారు. అందులో గొబ్బెమ్మను ఉంచి పూజలు చేశారు. ఆలయాలకు వెళ్లి దైవదర్శనాలు చేసుకున్నారు. తర్వాత చిన్నాపెద్ద తేడా లేకుండా గాలిపటాలను ఎగురవేశారు. పిండి వంటలు చేసుకుని బంధువులతో కలిసి విందు భోజనాలు చేశారు.

అమెరికాలో..

నిర్మల్‌ఖిల్లా:అమెరికాలోనూ ప్రవాస భారతీయులు, జిల్లా వాసులు సంక్రాంతి సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. ఉత్తర అమెరికాలోని గ్రేటర్ అట్లాంటాలో వాసవి సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో జిల్లాకు చెందిన పన్నెల జనార్దన్ తన గానంతో అలరించారు. ఖానాపూర్ మండలం సింగపూర్ గ్రామానికి చెందిన పన్నెల జనార్దన్ అట్లాంటాలో స్థిరపడ్డారు. సంక్రాంతి వేడుకల్లో ఆయన పాడిన పల్లె పాటలు అలరించాయి. కార్యక్రమంలో గాయిని నూతన మోహన్ పాల్గొన్నారు.

దుబాయ్‌లో..

ఖానాపూర్: దుబాయ్‌లోని సోనాపూర్ ప్రాంతంలో తెలుగువారి ఇతిసాలాట్ అకాడమీ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా జరుపుకున్నారు. హరిదాసుల వేషధారణ, ముగ్గుల పోటీలు, కోడి పందేలు నిర్వహించారు. కార్యక్రమంలో ఖానాపూర్ ప్రాంతానికి చెందిన మూడారపు పవన్, సాయి, మహేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్ రూరల్ : పతంగులు ఎగురవేస్తున్న చిన్నారులు

నెల పాలనలో..

- నియోజకవర్గంలో కలియదిరుగుతూ..
- సమస్యలేంటో తెలుసుకుంటూ..
- కొత్త ప్రతిపాదనలనూ పంపుతూ
- పట్టుపెంచుకుంటున్న కొత్త ఎమ్మెల్యేలు

కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో కొత్తదనం కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఎమ్మెల్యేలుగా ఎన్నికై నెల పూర్తయింది. గెలువగానే తమ పని మొదలుపెట్టారు. తమ నియోజకవర్గంలో కలియదిరుగుతూ స్థానికంగా సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారం దిశగా తమవంతు చర్యలను మొదలుపెట్టారు. నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఏకంగా అసెంబ్లీలో తన వాణి వినిపించారు. ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ గెలిచినప్పటి నుంచి క్షణం తీరిక లేకుండా ప్రజల్లోనే ఉంటున్నారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అధికారపార్టీకి చెందిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు సైతం ప్రజల్లోనే ఉంటున్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. – నిర్మల్

• నిర్మల్‌లో..



మెడికల్ కాలేజీని పరిశీలిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుంచి బిజీబిజీగా ఉంటున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత తొలి అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ తరఫున మాట్లాడే అవకాశం ఏలేటికి దక్కింది. పార్టీ ఇచ్చిన ఈ అవకాశాన్ని ఆయన చక్కగా వినియోగించుకున్నారు. పలు అంశాలను లేవనెత్తి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు సాధించుకున్నారు. ఇక నియోజకవర్గంలో శాఖలవారీగా అధికారులతో భేటీ అయ్యారు. మేజర్ సమస్యలపై పూర్తి సమాచారం తీసుకున్నారు. నియోజకవర్గంలో స్వర్ణనదిపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లతో ఇబ్బందులు, వరదలు, వాటిలో సరిదిద్దాల్సిన లోపాలను ఇరిగేషన్ ఈఎస్‌సీ మురళీధర్‌రావు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాలం నిర్మల్ మునగడంపై స్పందిస్తూ నాళాల ఆక్రమణలను తొలగించాలని, వరదలపై డీటెయిల్డ్ రిపోర్టు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. నిర్మల్ మెడికల్ కాలేజీ, ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు.

ప్రణాళికాబద్ధంగా పని..



ఎమ్మెల్యేగా గెలిచిన మరుక్షణం నుంచి ప్రజాజీవితంలో బిజీ అయ్యాను. అసెంబ్లీలో రాష్ట్ర సమస్యలు లేవనెత్తాను. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి రోడ్డు, బస్సు కావాలి. పంచాయతీలు, బడులకు బిల్డింగులు కావాలి. ఇలా చాలా సమస్యలపై ప్రణాళికబద్ధంగా పనిచేస్తాం. క్యాంప్ ఆఫీస్‌తోపాటు ఇంట్లోనూ ప్రజలకు అందుబాటులో ఉండేలా కాల్‌సెంటర్ ఏర్పాటు చేస్తాం.

– ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే, నిర్మల్

• ఖానాపూర్‌లో..



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

వెడ్మబొజ్జు ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుంచి క్షణం తీరికగా ఉండటం లేదు. నియోజకవర్గం లేదంటే హైదరాబాద్‌లో ఏదో ఒక పనిలో ఉంటున్నారు. తమ ప్రభుత్వమే రాష్ట్రంలో అధికారంలో ఉండటంతో ఉదయం నుంచి రాత్రి వరకు బొజ్జు కోసం జనం వస్తూనే ఉన్నారు. ఎమ్మెల్యే కూడా ప్రతీ కార్యక్రమానికి హాజరవుతున్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనను విజయవంతంగా పూర్తిచేయించారు. ప్రజాపాలనలో సమస్యలపై వచ్చిన దరఖాస్తులపైనా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత చేపట్టిన తొలి పనైన ఇంద్రవెల్లి అమరుల స్మృతివనం పనులు ప్రారంభించారు. కడెం మండలం ఉడుంపూర్‌లో చెక్‌డ్యాం, కాలువ నిర్మాణానికి సంబంధించి రూ.9 లక్షలతో పనులు ప్రారంభించారు. స్వగ్రామం కల్లారుగూడకు రోడ్డు, పెంబి మండలం మందపల్లిలో కేజీబీవీ భవనాన్ని ప్రారంభించారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లో సమస్యలు, రిహాబిలిటేషన్ గ్రామాల గురించి డీఎఫ్‌వో, ఇతర అటవీ అధికారులతో మాట్లాడారు. మంత్రి సీతక్కకు కడెం ప్రాజెక్టుకు చేపట్టాల్సిన మరమ్మతులు, సదర్మట్ సమస్యలను స్వయంగా చూపించారు.

ఇసుక మాఫియాపై దృష్టి..



ఖానాపూర్‌లో ఏళ్లుగా సమస్యలు పేరుకుపోయాయి. ఈనెల మొత్తం ప్రజల్లోనే ఉంటూ సమస్యలు తెలుసుకున్నా. ప్రభుత్వ సహకారంతో వాటిని పరిష్కరిస్తా. అటవీ ప్రాంతం నుంచి ఇసుకను తీసుకెళ్తున్న మాఫియాపై దృష్టిపెడతాం. గిరి గ్రామాల అభివృద్ధికి కార్యచరణ చేపడతాం.

– వెడ్మబొజ్జుపటేల్, ఎమ్మెల్యే, ఖానాపూర్

• ముథోల్‌లో..



భైంసా ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

పవార్ రామారావుపటేల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే ముథోల్ నియోజకవర్గ సమస్యలపై దృష్టి పెట్టారు. క్షణం తీరిక లేకుండా ఎప్పుడూ ఏదో కార్యక్రమంలో పాల్గొంటూనే ఉన్నారు. ప్రధానంగా ముథోల్ నుంచి పంచగుండి వరకు డబుల్ రోడ్డు కోసం రూ.36 కోట్లతో, సిరాల ప్రాజెక్టు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించారు. నియోజకవర్గం ఎదుర్కొంటున్న తాగు, సాగునీటిపై దృష్టిపెడుతున్నారు. ఇప్పటికే మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్‌లలో లోపాలను తెలుసుకుంటున్నారు. ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న ముంపు గ్రామం గుండెగాం విషయాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. భైంసా ఆస్పత్రిలోడయాలసిస్ సెంటర్‌నూ ప్రారంభించారు.

విద్య, వైద్యం, అభివృద్ధి...




గత పాలకుల కారణంగా ముథోల్ చాలా వెనుకబడింది. గెలిచిన మరుసటి రోజునుంచే పూర్తిగా ప్రజలకు అందుబాటులో ఉంటున్నాను. ప్రధానంగా విద్య, వైద్య రంగాలపై దృష్టిపెడతాను. ముథోల్ అభివృద్ధి కోసం ప్రణాళికబద్ధంగా ముందుకెళ్తా. ఇప్పటికే కొన్ని ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించా.

– పవార్ రామారావుపటేల్, ఎమ్మెల్యే, ముథోల్

ఆన్‌లైన్‌లో 'ఇన్‌స్పైర్'



సైన్స్ ప్రాజెక్ట్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు(ఫైల్)



ఇన్‌స్పైర్ యాప్

- విద్యార్థులు ప్రదర్శించే అవకాశం
- ఈనెల 18 వరకు ప్రాజెక్టుల అప్‌లోడ్
- జిల్లా స్థాయికి 119 ఎగ్జిబిట్లు ఎంపిక

మామడ:శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సమాజానికి మేలు జరిగేలా విద్యార్థుల్లో పరిశోధనా శక్తిని పెంపొందించి విజ్ఞానశాస్త్రంపై ఆసక్తి కలిగిస్తూ సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రభుత్వం 2009–2010 నుంచి ఇన్‌స్పైర్(ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్ రీసర్చ్), మానక్(మిలియన్ మైండ్స్ అగుమెంటింగ్ నేషనల్ అస్పిరేషన్ అజీడ్ నాలెడ్జ్) కార్యక్రమం నిర్వహిస్తోంది. 2022–23 విద్యాసంత్సరంలో వివిధ పాఠశాలల నుంచి 1,200లకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 119 ప్రాజెక్టులను అధికారులు ఎంపిక చేశారు. ఈ యేడాది ప్రాజెక్టులను ప్రత్యక్ష పద్ధతిలో కాకుండా, ఆన్‌లైన్‌లో ఈనెల 18లోపు ఇన్‌స్పైర్ మానక్ కాంపిటీషన్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని విద్యాశాఖ అధికారులు సూచించారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన అంశాలు..

1. ప్రాజెక్టుకు సంబంధించి విద్యార్థి ప్రదర్శించే రెండు నిమిషాల నిడివి కలిగిన వీడియో(30 ఎంబీ లోపు ఉండాలి).
2. ప్రాజెక్టుకు సంబంధించిన విద్యార్థి వాయిస్ మెసేజ్‌ను అప్‌లోడ్ చేయాలి.
3. విద్యార్థి పాస్‌పోర్టు సైజ్ ఫొటో, బోనఫైడ్, ప్రాజెక్ట్ ప్రదర్శన ఫొటో, ప్రాజెక్ట్ ఫొటోలు.
4.ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి వివరాలు వెయ్యి పదాల్లో ఉండేలా తయారు చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.
5.యాప్‌లో విద్యార్థి రెఫరెన్స్ నంబర్, పాస్‌వర్డులు నమోదు చేసి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

119 ప్రాజెక్టులు....

ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న విద్యార్థుల నమూనాలను జాతీయ పరిశోధన సంస్థ పరిశీలించి, జిల్లా స్థాయికి ఎంపికైన 119 మంది విద్యార్థులకు రూ.10 వేల చొప్పున రూ.11.90 లక్షలు విద్యార్థుల బ్యాంకు అకౌంట్‌లో జమయ్యాయి. ఈ డబ్బులతో పరిశోధనలకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసి, విద్యార్థులు ముందుగా తమ ప్రదర్శనను ఈ నెల 18లోపు జిల్లాస్థాయి ఎంపిక కోసం ఆన్‌లైన్‌లో ప్రదర్శించాల్సి ఉంటుంది. 10 వేల మంది విద్యార్థుల ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన వెయ్యి మందిని జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తారు. జాతీయ స్థాయిలో ఉత్తమమైన 60 ప్రదర్శనలను ఎంపిక చేసి వీటిని ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ఉత్సవాల్లో ప్రదర్శిస్తారు. జాతీయస్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ఏటా ఉపకార వేతనాలను అందిస్తారు.

జాతీయస్థాయికి ఎంపికైతే కలిగే ప్రయోజనాలు...

1. ఉన్నత చదువులకు ఉపకార వేతనాలను వినియోగించుకోవచ్చు.
2. ఐఐటీ ఢిల్లీ కళాశాలలో ప్రవేశానికి అదనపు పాయింట్స్ కేటాయిస్తారు.
3. భారత రాష్ట్రపతిని కలిసే అవకాశం ఉంటుంది.
4. ప్రాజెక్టు పేటెంట్ పొందే అవకాశం కల్పిస్తారు.

అవగాహన కల్పించాం



జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మేళాకు ఎంపికైన పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు ప్రాజెక్ట్ ఆన్‌లైన్ ప్రదర్శనపై సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాం. ఇన్‌స్పైర్ మానక్ కాంపిటీషన్ యాప్‌లో విద్యార్థులు వివరాలు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– వినోద్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి

ప్రాజెక్టు వివరాలు నమోదు చేయాలి



2022–23 విద్యాసంవత్సరంలో ఇన్‌స్పైర్ మేళాకు జిల్లాస్థాయిలో 119 ఇన్‌స్పైర్ ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఎంపికైన ప్రతీ ప్రాజెక్ట్ ఈ నెల 18 లోపు యాప్ ద్వారా విద్యార్థి ఆన్‌లైన్‌లో ప్రదర్శించేలా సంబంధిత ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

నిర్మల్ జిల్లా.. సాహిత్య ఖిల్లా..

- తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు హన్మంతు

నిర్మల్ ఖిల్లా:నిర్మల్ జిల్లాలో కవులు, కళాకారులు సాహితీవేత్తలకు కొదువలేదని, ఈ జిల్లా సాహిత్య ఖిల్లాగా పేరుగాంచిందని, తెలంగాణ రచయితల వేదిక నిర్మల్ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హన్మంతు అన్నారు. అంతర్జాతీయ తెలుగు 2వ మహాసభల్లో సాహిత్య పురస్కారాలు అందుకున్న పద్యకవి బి.వెంకట్‌ను జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్ లయన్స్ క్లబ్ కార్యాలయంలో మంగళవారం సన్మానించారు. హన్మంతు మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహాసభల్లో జిల్లా నుంచి హాజరై, నిర్మల్ గొంతుక వినిపించారని వెంకట్‌ను అభినందించారు. మానవీయ విలువలపై ప్రసంగించారని, తనదైన శైలిలో పద్యాలను ఆలపించారని కొనియాడారు. వచన కవిత్వం, కథా పఠనం, సందేశాత్మకమైన కథలను వినిపించారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారని తెలిపారు. వివిధ సాహితీ ప్రక్రియలద్వారా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం వెంకట్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ కవులు, సాహితీవేత్తలు మునిమడుగుల రాజారావు, తెరవే ఉపాధ్యక్షులు అంబటి నారాయణ, పత్తి శివప్రసాద్, తుమ్మల దేవరావు, కామారపు జగదీశ్వర్, డాక్టర్ కృష్ణంరాజు, పోలీస్ భీమేశ్, అబ్బాటి రాజేశ్వర్‌రెడ్డి, అప్పర్, నాగారాం తదితరులు పాల్గొన్నారు.



వెంకట్‌ను సన్మానిస్తున్న తెరవే సభ్యులు

యూరియా కోసం బారులు

కుంటాల: కుంటాల సహకార సంఘ భవనం వద్ద యూరియా కోసం రైతులు క్యూ కట్టారు. సోమవారం సొసైటీకి 1,350 యూరియా బస్తాలు వచ్చాయి. ఒక్కో రైతుకు 10 బస్తాల యూరియాను పంపిణీ చేశారు. సీఈవో నాగభూషణం పోలీసుల సమక్షంలో యూరియాను పంపిణీ చేయించారు. జిల్లాలో యూరియా కొరత లేకుండా చర్యలు చేపడతామని, రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ పేర్కొన్నారు. రైతులకు యూరియా పంపిణీని మంగళవారం పరిశీలించారు. యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 36,064 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, 28,300 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని తెలిపారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో అవసరమయ్యే 700 మెట్రిక్ టన్నుల యూరియా మార్క్‌ఫెడ్ ఆధీనంలో ఉందని పేర్కొన్నారు. యూరియా కొరత రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట సీఈవో నాగభూషణం, ఏఈవోలు శ్రీధర్, గణేశ్, సిబ్బంది ఉన్నారు.



యూరియా కోసం క్యూలో నిల్చున్న రైతులు

క్లుప్తంగా

చిన్నబుగ్గారంలో మద్యపాన నిషేధం


తీర్మానం గ్రామపెద్దలకిస్తున్న యువకులు

నేరడిగొండ: మండలంలోని చిన్నబుగ్గారం గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం విధిస్తున్నట్లు ఆ గ్రామ గణేశ్ యూత్ సభ్యులు తెలిపారు. ఈమేరకు గ్రామ పెద్దలు, యువకులు అంతా కలిసి మంగళవారం తీర్మానం చేశారు. గ్రామంలో యువకులు మద్యానికి బానిసై కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, దీంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎవరైన గ్రామ పెద్దల తీర్మానాన్ని ఉల్లంఘిస్తే రూ.3వేల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. గ్రామస్తులు సహకరించాలని కోరారు.

నూతన నియామకం


కామన్ విఠల్

ఆదిలాబాద్‌రూరల్: జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని లాండసాంగ్వి గ్రామానికి చెందిన కామని విఠల్‌ను నియమించినట్లు అతడు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ చేతి వృత్తుల పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్ సూచనలతో జాతీయ ప్రధాన కార్యదర్శి నీలూరి రుషింగప్ప నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

రేషన్ బియ్యం పట్టివేత

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. సోమవారం నిజామాబాద్ నుంచి ఐచర్ వాహనంలో 250 క్వింటాళ్లకుపైగా బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని సివిల్ సప్లై డీటీకి అప్పగించారు. వాహనదారుడు షేక్ మోయిజ్‌పై కేసు నమోదు చేశారు.

పీడీఎస్ బియ్యం..

భైంసాటౌన్: పట్టణంలోని వినాయక్‌నగర్‌లో పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ఎల్.శ్రీను తెలిపారు. సోమవారం బొలేరో వాహనంలో 27 సంచుల పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నారు. కేసు నమోదు చేసుకున్నామని, స్వాధీనం చేసుకున్న బియ్యం రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నిర్మల్‌రూరల్: మండలంలోని కొట్ల(కె) గ్రామంలో సోమవారం పేకాటాడుతున్న ఏడుగురుని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. పేకాటాడుతున్నారని సమాచారం తెలుసుకొని స్థావరంపై దాడిచేసి వారి నుంచి రూ.19,800 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఇసుక నిల్వలు స్వాధీనం


ఇసుక నిల్వ వద్ద బందోబస్తులో పోలీసులు

భైంసాటౌన్:పట్టణంలోని పలు బహిరంగ ప్రదేశాల్లో డంప్ చేసిన ఇసుక నిల్వలను అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా జరిపిన తనిఖీల్లో ఆటోనగర్, భైంసా–బాసర మార్గంతోపాటు 12 ప్రదేశాల్లో నిల్వ చేసిన ఇసుక కుప్పలను సీజ్ చేశారు. అలాగే ఆయా ఇసుక కుప్పల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ విషయమై ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్‌ను వివరణ కోరగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్, రెవెన్యూ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆర్డీవో, మైనింగ్ అధికారులకు నివేదిక ఇస్తామని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రాయల్టీ, తదితర వివరాలు పరిశీలించి ఇసుక నిల్వలు అక్రమమని తేలితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అర్లి(టి) విద్యార్థులు



తాంసి: ఈ నెల 16 నుంచి 18 వరకు నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌లో జరిగే 67వ రాష్ట్రస్థాయి ఎస్.జి.ఎఫ్ సాఫ్ట్‌బాల్ పోటీలకు భీంపూర్ మండలంలోని అర్లి(టి) పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 3న ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చారు. అర్లి(టి) పాఠశాలకు చెందిన జి.దుర్గాప్రసాద్, నందకిషోర్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ స్వామి తెలిపారు.

‘పది’లో ఏడు పేపర్లు

- ఎస్సెస్సీలో సైన్స్ సబ్జెక్టులకు వేర్వేరుగా పరీక్షలు
- మిగతా సబ్జెక్టులు మాత్రం రోజుకొకటి..
- విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుందంటున్న నిపుణులు


చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ప్రభుత్వం పదో తరగతి పరీక్షలు షెడ్యూలులో ఈసారి స్వల్ప మార్పులు చేసింది. గతంలో ప్రతి పరీక్ష ఒక్కోరోజు నిర్వహించగా ఈసారి ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పరీక్షలను రెండు వేర్వేరు రోజుల్లో నిర్వహించనుంది. మిగతా సబ్జెక్టుల పేపర్‌కు 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తుండగా, సైన్స్ రెండు పరీక్షలు విభజించి ఒక్కో పరీక్ష 50 మార్కులకు నిర్వహించనుంది. ఈ కొత్త విధానంలో విద్యార్థులపై ఒత్తిడి తగ్గిపోతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

రెండేళ్లుగా ఒకే పరీక్ష...

రెండేళ్లుగా ఈ రెండు పేపర్లు ఒకే పరీక్షగా, ఒకే రోజున నిర్వహించే వారు. విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుండి వచ్చిన వినతుల మేరకు ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ సబ్జెక్టులను వేర్వేరుగా పరీక్షలు నిర్వహించడానికి ఈసారి కాలనిర్ణయ పట్టికను విడుదల చేశారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, సాంఘిక శాస్త్రాలకు ఒక్కొక్క ఉపాధ్యాయుడు బోధిస్తుండగా సైన్స్ సబ్జెక్టులైన ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్‌లకు వేరు వేరు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. దీంతో పరీక్షలు కూడా వేరువేరుగా ఉండాలనే వినతులు ఉత్పన్నమయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ కూడా నిర్ణయం తీసుకొని ఒక్కో పరీక్షకు 50మార్కుల చొప్పున రెండు పరీక్షలను నిర్వహించనున్నారు.

ఈసారి భిన్నంగా సైన్స్ పరీక్షలు...

కరోనా సంక్షోభానికి ముందు హిందీ మినహా మిగతా సబ్జెక్టులకు రెండు వేరు వేరు పరీక్షలు 50మార్కులకు చొప్పున నిర్వహించేవారు. కరోనా అనంతరం అన్ని సబ్జెక్టులకు ఒక్కో పరీక్షగా రెండేళ్లుగా నిర్వహిస్తున్నారు. ఈసారి భిన్నంగా మిగతా అన్ని సబ్జెక్టులకు ఒక్కో పరీక్షను ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్‌లకు మాత్రం ప్రత్యేకంగా వేర్వేరు రోజుల్లో టైం టేబుల్‌ను విడుదల చేయడంతో విద్యార్థుల్లో ఆనందం వ్యక్తం అవుతుంది. ఈ మేరకు సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులకు కూడా విద్యార్థులకు మెలకువలను సూచించేందుకు తగిన సమయం లభిస్తుంది. ఒక్కో పరీక్షకు ఒక్కో వ్యూహాన్ని అనుసరించడానికి వీలుంటుంది. మార్చి 18 నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో భౌతిక శాస్త్రం పరీక్ష మార్చి 26న, జీవశాస్త్రం పరీక్ష 28న నిర్వహించేందుకు షెడ్యూల్‌ను విడుదల చేశారు.

ప్రభుత్వ నిర్ణయం సమంజసం...



పదో తరగతిలో ఏడు పేపర్లను వేరువేరు రోజుల్లో పరీక్షలు నిర్వహించడానికి టైం టేబుల్ విడుదల చేసింది. దీంతో విద్యార్థులకు మంచి వెసులుబాటు ఉంటుంది. ప్రశాంతంగా పరీక్షలు రాసి ఎక్కువ మార్కులు సాధించేందుకు అవకాశం కలుగుతుంది. విద్యార్థుల తల్లిదండ్రుల సూచనలను పరిగణలోకి తీసుకొని నూతనంగా పరీక్షలు నిర్వహించేందుకు టైం టేబుల్‌ను ఖరారు చేసింది.

–జువ్వల శ్రీధర్, స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్), జెడ్పీహెచ్ఎస్, పోశ్‌పట్ల

విద్యార్థులకు వెసులుబాటు...



భౌతిక రసాయన జీవ శాస్త్ర పరీక్షలను వేర్వేరు రోజుల్లో నిర్వహించేందుకు టైం టేబుల్‌ను విద్యాశాఖ విడుదల చేయడం హర్షనీయం. ఈ విధానంతో విద్యార్థులకు కూడా వెసులుబాటు కలుగుతుంది. ఒత్తిడికి గురికాకుండా ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పరీక్షలను వేరువేరు రోజుల్లో ప్రశాంతంగా రాసేందుకు వీలుంటుంది.

– జి.రాంచందర్, పీజీహెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్, పెంబి

పండుగ పూట విషాదం..

- రెండు ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరి మృతి
- మరొకరికి గాయాలు
- గుంతను తప్పించే క్రమంలో ప్రమాదం


కైలాస్ మృతదేహం


కైలాస్ (ఫైల్)

తానూరు: పండుగ పూట విషాదం నెలకొంది. మండలంలోని హిప్నెల్లి శివారులో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... భోసి గ్రామానికి చెందిన టక్కన్ కైలాస్(42) ద్విచక్రవాహనంపై తానూరుకు వెళ్తున్నాడు. బెంబర గ్రామానికి చెందిన శివపూరే మానిక్‌దాస్ తానూరు నుంచి స్వగ్రామమైన బెంబరకు బైక్‌పై వెళ్తుండగా హిప్నెల్లి శివారు ప్రాంతంలో ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో టక్కన్ కైలాస్ అక్కడికక్కడే మృతిచెందగా శివపూరే మానిక్‌కు తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు మానిక్‌ని చికిత్స నిమిత్తం భైంసాలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యుల సూచన మేరకు నిజామాబాద్ జిల్లాలోని ఆస్పత్రికి తరలించారు. మృతుడు కైలాస్ భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుంతను తప్పించే క్రమంలో ప్రమాదం ...

హిప్నెల్లి గ్రామ శివారులో డబుల్‌రోడ్డుపై అక్కడికక్కడ గుంతలు ఏర్పడ్డాయి. గుంతను తప్పించే క్రమంలో సోమవారం రెండు ద్విచక్రవాహన దారులు ప్రమాదానికి గురైనట్లు ప్రయాణికులు తెలిపారు. గుంతలతో ఈ మార్గంలో పలు ప్రమాదాలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు రోడ్డును ఎప్పటికప్పుడు పర్యవేక్షించి గుంతలను పూడ్చివేస్తే ప్రమాదం జరిగేది కాదని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు గుంతలను పూడ్చివేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టిప్పర్ ఢీకొని బాలుడు..


సిద్ధార్థ్ (ఫైల్)

నిర్మల్‌రూరల్: పండుగ పూట పతంగి కొనుక్కొని ఇంటికి వెళ్తున్న ఓ బాలుడిని టిప్పర్ రూపంలో మృత్యువు కబలించింది. అప్పటి వరకు తోటి స్నేహితులతో సరదాగా ఆడుకున్న బాలుడు టిప్పర్ ఢీకొని మృతి చెందిన విషాద ఘటన సోమవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మంచిర్యాల జిల్లా మందమర్రి ప్రాంతానికి చెందిన రాజేందర్ – సుమలత దంపతులు జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ ప్రాంతంలో కొంత కాలంగా నివాసముంటున్నారు. రాజేందర్ గతంలో 104 వాహన డ్రైవర్‌గా పనిచేయగా, ప్రస్తుతం ప్రైవేట్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య బట్టలు కుడుతూ కుటుంబానికి ఆసరాగా ఉంటుంది. వీరికి ఇద్దరు కుమారులు కాగా చిన్న కుమారుడు సిద్ధార్థ్ (11) ఓ ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి రోజు తోటి మిత్రులతో సరదాగా ఆడుకున్న తర్వాత పతంగి కొనేందుకు సైకిల్‌పై బయటకు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో లోడుతో వెళ్తున్న టిప్పర్ వెనుక నుంచి ఢీకొట్టింది. డ్రైవర్ టిప్పర్‌ను వదిలేసి వెంటనే పరారయ్యాడు. స్థానికులు టిప్పర్‌ను కాస్త పక్కనపెట్టి టైర్ల కింద నుంచి బాలుడిని బయటకు తీశారు. 108 వాహనం రావడం ఆలస్యం కావడంతో ఆటోలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. హైదరాబాద్‌లో పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకువెళ్లారు. ప్రమాద దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి


ఖాజా మోయినొద్దీన్ (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని అర్బా గార్డెన్ సమీపంలోని స్వీపర్ కాలనీ ప్రాంతంలో అనుమానాస్పదంగా యువకుడు మృతిచెందాడు. కుటుంబీకుల వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన ఖాజా మోయినొద్దీన్ (23) సోమవారం రాత్రి 9.30గంటల ప్రాంతంలో ఆయన ఇంటికి గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తీసుకెళ్లాడు. ఆ తర్వాత పది నిమిషాల్లోనే యువకుడు ఇంటికి తిరిగివచ్చి కిందపడిపోయాడు. దీంతో కుటుంబీకులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఇదిలా ఉండగా మోయినొద్దీన్ సైకిల్ ట్యాక్సీ నడుపుతూ వృద్ధప్యంలోని తల్లిదండ్రులను పోషిస్తున్నాడు. మృతుడి అక్క రుక్సార్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అనుమానాస్పద మృతిగా ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ చెప్పాడు.

గుండెపోటుతో యువకుడు..


సునీల్(ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని లాండసాంగ్వి గ్రామానికి చెందిన జిల్లా దళితాభివృద్ధి శాఖ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఈరగొల్ల సునీల్(39) గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. సునీల్ 2016 నుంచి జిల్లా దళితాభివృద్ధి శాఖ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండగా ఛాతిలో నొప్పి వచ్చింది. చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించగా వైద్యులు వైద్య పరీక్షిస్తున్న క్రమంలో మృతిచెందాడు. మృతుడికి భార్య శ్రీవేణి, కుమార్తె మిల్కు, కుమారుడు మణిదీప్ ఉన్నారు. ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రిమ్స్ మార్చురీలో గుర్తుతెలియని శవం


గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి సీటీటీ మెడికల్ వార్డులో ఇటీవల రైల్వేస్టేషన్ వద్ద ఉన్న గుర్తు తెలియని వృద్ధుడిని మానవ సేవే మాధవ సేవ సభ్యులు చేర్పించారు. చికిత్స పొందుతూ ఈనెల 12న మృతిచెందినట్లు రిమ్స్ ఆర్ఎంవో చందు తెలిపాడు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచామని, సంబంధికులు ఉంటే మృతదేహాన్ని తీసుకెళ్లాలని తెలిపారు.

కాలువలు మూసివేస్తున్న వారిపై చర్య తీసుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

నర్సాపూర్(జి): మండల కేంద్రం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవుని చెరువు, నడిం చెరువు, ఊర చెరువు గొలుసుకట్టు కాలువలను మూసివేస్తూ అక్రమంగా వెంచర్ చేస్తున్నవారిపై చర్య తీసుకోవాలని నర్సాపూర్(జి) రైతులు, గంగపుత్రులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మండలకేంద్రానికి చెందిన అప్పాల రాజగంగుబాయి చెరువుల కింద గల ఆయకట్టు పంట పొలాలకు నీరు అందించాలనే ఉద్దేశంతో తన సొంత ఖర్చుతో కాలువలో పూడిక తీయించారు. అయితే మండల కేంద్రానికి చెందిన జీవీ.భూమేశ్వర్‌రెడ్డి తన పంట భూమిని ఇటీవల లేఅవుట్‌గా మార్చారు. దీనిగుండా గొలుసు కట్టు చెరువు కాలువ ఉండగా పూడికతీత పనులను నిలిపివేశాడు. పనులు నిలిచిపోవడంతో రైతులు, గంగపుత్రులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. 40 ఏళ్లుగా ఉన్న కాలువల్లో పూడికతీత పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

‘అయోధ్య సైకిల్‌యాత్ర’కు స్వాగతం


స్వాగతం పలుకుతున్న సైక్లింగ్ క్లబ్ సభ్యులు

నిర్మల్: హైదరాబాద్‌లోని బోరబండ నుంచి అయోధ్యకు సైకిల్‌యాత్రగా ఈనెల 12న అభిషేక్, సాయి, వెంకటేశ్, తిరుమల్ అనే యువకులు బయలుదేరారు. వీరు నిర్మల్ చేరుకోవడంతో జిల్లా సైక్లింగ్ క్లబ్(ఎన్‌సీసీ) ఆధ్వర్యంలో సన్మానించారు. ఎన్‌సీసీ సభ్యులు, వైద్యులు రామకృష్ణ, రాంచందర్ రెడ్డి, రాకేశ్‌రెడ్డి, సాయినందన్, రాజుకుమార్, కేఆర్ ప్రసాద్‌రెడ్డి, నవీన్‌గోల్డ్, ప్రణవ్, భిక్షపతి, ఈసవేణి మనోజ్‌యాదవ్ పాల్గొన్నారు.

కోటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే


ఎమ్మెల్యే శంకర్‌ను సన్మానిస్తున్న బీజేపీ శ్రేణులు

వెల్గటూర్: జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని కోటిలింగాల కోటేశ్వరస్వామిని బీజేపీ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం బీజేపీ శ్రేణులు శాలువతో సన్మానించారు. ఎమ్మెల్యే తన కుటుంబ సభ్యులతో కలిసి గోదావరి నదిలో బోటింగ్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి జనార్దన్, బండారి రాజేందర్, సంగ వెంకటగిరి, గుమ్ముల సతీష్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గౌస్‌ఆలమ్


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

- ఏడు ద్విచక్ర వాహనాలు, ఆటో సీజ్

ఆదిలాబాద్‌టౌన్: నలుగురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి దొంగలించిన ఆభరణాలు, వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ గౌస్ ఆలమ్ అన్నారు. సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకోవడం జరిగిందన్నారు. ఐదుగురిపై కేసులు నమోదు చేయగా, నలుగురిని అరెస్టు చేశామని, ఒకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఎజాజ్, రవీంద్రనగర్‌కు చెందిన టి.అజయ్, టీచర్స్ కాలనీకి చెందిన ఎం.రాజేశ్వర్, కోలిపురకు చెందిన షేక్ సమీర్‌లను అరెస్టు చేయగా, మహారాష్ట్రకు చెందిన సయ్యద్ ముస్వర్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితులు జల్సాలకు అలవాటుపడి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. వీరిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి పట్టుకున్నామని, వీరి నుంచి ఏడు ద్విచక్ర వాహనాలు, ఆటో, ఒక టీవీ, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరు ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసి మహారాష్ట్రలోని కిన్వట్‌లో అమ్ముతున్నారని అన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ పోతారం శ్రీనివాస్, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సాయినాథ్, ఎస్సై లక్ష్మయ్య, ఐటీ కోర్ సిబ్బంది సంజీవ్ కుమార్, ఏఎస్ఏ రియాస్ పాల్గొన్నారు.

కొయ్యబొమ్మలను ఆన్‌లైన్‌లో విక్రయించాలి

- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్


సమావేశానికి హాజరైన అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ కొయ్యబొమ్మల విక్రయాలను ఆన్‌లైన్‌లో అమ్మకాలు జరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో నిర్మల్ కొయ్య బొమ్మల తయారీపై డీఎఫ్‌వో, డీఆర్డీఏ, ఇండస్ట్రీ కళాకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మల్ కొయ్యబొమ్మలను కళాకారులు సహజత్వం ఉట్టిపడేలా తయారు చేయడం మన దేశంలోనే కాక అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిందన్నారు. కళాకారులకు ఉపాధి లభించేలా ఆన్‌లైన్ ద్వారా బొమ్మలను విక్రయించేందుకు తగిన చర్యలు చేపట్టాలని, అందుకు అటవీశాఖ అధికారి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయసహకారాలు అందించాలన్నారు. ముఖ్యంగా పొనికి వనాన్ని ఎక్కువగా ఏర్పాటు చేసి కర్రను అందుబాటులోకి తేవాలన్నారు. బొమ్మల ప్యాకింగ్ కోసం మహిళా సంఘాలకు శిక్షణనిచ్చి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, ఈడీఎం నదీమ్ డీఎఫ్‌వో రాంకిషన్, డీఆర్డివో విజయలక్ష్మి, ఇండస్ట్రీ అధికారి నర్సింహారెడ్డి, మేనేజర్ శంకర్, సొసైటీ అధ్యక్షుడు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో ప్రముఖులు


పూజలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్(ఐఏఎస్) మంద మకరందు సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా ఆలయానికి వచ్చిన ఐఏఎస్ అధికారికి ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

అమ్మవారిని దర్శించుకున్న రాయవరపు శివప్రసాద్


రాయవరపు శివప్రసాద్ కుటుంబ సభ్యులు

భైంసా: బాసర సరస్వతి అమ్మవారిని మంగళవారం రాయవరపు శివప్రసాద్ కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. శివప్రసాద్ ఆరు నెలలుగా అమ్మవారికి నిత్య పూజల కోసం ప్రతినెల 100 కిలోల పసుపు, కుంకుమను ఆలయానికి సమర్పిస్తున్నాడు. ఆలయానికి వచ్చిన ఈ కుటుంబీకులను ఆలయ మర్యాదలతో స్వాగతించి తీర్థప్రసాదాలు అందించారు.

భక్తులకు ఉమామహేశ్వరుడి దర్శనం


నేడు దర్శనమిస్తున్న ఉమామహేశ్వరుడు


నాడు గోదావరిలో మునిగిన ఆలయం

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామ సమీపంలోని నందిపేట్ మండలం ఉమ్మెడ ఉమామహేశ్వరుడు గోదావరి బ్యాక్ వాటర్లో మునిగి ప్రస్తుతం తేలి భక్తులకు నుంచి దర్శనమిస్తున్నాడు. ఈ ఏడాది జూన్, జులై మాసాల్లో కురిసిన భారీ వర్షాలకు ఎస్సారెస్పీ నిండి బ్యాక్ వాటర్ చేరడంతో నందిపేట్ మండలం ఉమ్మెడ ఉమామహేశ్వర శివాలయం పూర్తిగా నీటిలో మునిగింది. ఏడు నెలల తరువాత ప్రస్తుతం ఎస్సారెస్పీ నుంచి పంటలకు సాగునీటిని విడుదల చేయడంతో బ్యాక్ వాటర్ తగ్గి ఆలయం తేలింది. వారం రోజులుగా భక్తులకు దర్శనమిస్తున్నాడు.

ఆదిలాబాద్ – ఆర్మూర్ రైల్వేలైన్ ఏర్పాటు చేయాలి


రిలే దీక్షలో సాధన కమిటీ సభ్యులు

ఆదిలాబాద్: ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ వెంటనే ఏర్పాటు చేయాలని ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ సాధన కమిటీ చైర్మన్ కాసవేని నారాయణ యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి విశ్రాంతి భవనం సమీపంలో సాధన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వే లైన్ అనేది ఆదిలాబాద్ జిల్లా ప్రజల చిరకాల కోరిక అని పేర్కొన్నారు. ఈ రైల్వే లైన్ కోసం ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదిలాబాద్– పటాన్చెరు రైల్వేలైన్ కోసం రూ.5,700 కోట్లతో సర్వే పనులు చేసిందన్నారు. సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ రైల్వేలైన్ నిర్మాణంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ రైల్వేలైన్ పూర్తయ్యే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ రిలే నిరాహార దీక్షలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలూరి గోవర్ధన్ రెడ్డి సంఘీభావం ప్రకటించారు. కమిటీ గౌరవ అధ్యక్షుడు సంద అశోక్, నిమ్మల నరేందర్, సిర్ర దేవేందర్, ఆంజనేయులు, దేవిదాస్ ఉన్నారు.

18 నుంచి నిత్యాన్నదానం


విరాళాలు అందజేస్తున్న భక్తులు

నిర్మల్‌ఖిల్లా: ఈనెల 18వ తేదీ గురువారం నుంచి గండి రామన్న సాయిబాబా ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. నిత్యాన్నదానం నిర్వహణ, ఆర్థిక వనరుల సమీకరణ, భక్తులకు కల్పించే సదుపాయాలపై మంగళవారం ఆలయ క్షేత్రంలో ఆలయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేందుకు పలునిర్ణయాలు తీసుకున్నామన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రతీరోజు మధ్యాహ్న హారతి అనంతరం అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 18న డీసీసీ అధ్యక్షుడు కె.శ్రీహరిరావు, జెడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి తదితరులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. నిత్యాన్నదాన కార్యక్రమానికి దాతలు విరాళాలు అందజేయాలని ఆయన కోరారు. భక్తులు జొన్నల మనోహర్, ఉప్పుల నందు తదితరులు రూ.50 వేల విరాళం అందజేశారు. ఎం.శశిధర్, కె.లక్ష్మణ్ రూ.11 వేల చొప్పున, ద్యావరశెట్టి శ్రీకాంత్, ప్రకాశ్‌గౌడ్ రూ.5,116 అందజేశారు.